# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 360 | బుధవారం, 27 ఆగస్టు 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


## అసలు రేవంత్ రెడ్డి ఎవరు?

బీహార్ రాజకీయాల్లో రేవంత్ రెడ్డి జోక్యం ఏమిటన్న ప్రశాంత్ కిశోర్
రేవంత్ రెడ్డికి బీహార్‌లో ఏం పని అని నిలదీత
బీహార్‌ను అవమానించాడని ఆగ్రహం



**హైదరాబాద్ ఆగస్టు 26 (ప్రజాస్వరం):**

మాజీ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ రాజకీయాల్లో రేవంత్ జోక్యం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు. "అసలు రేవంత్ రెడ్డి ఎవరు? బీహార్‌లో ఆయనకు

..మిగతా 2లో

## కాంగ్రెస్ మళ్లీ గెలిస్తే రాజకీయాలు వదిలేస్తా...
# పీసీసీ చీఫ్ ఒక గజినీ

బీజేపీ ఎంపీల గెలుపుపై దొంగ ఓట్ల ఆరోపణలను ఖండించిన బండి సంజయ్
ఆరు గ్యారంటీల హామీలు ఏమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రశ్న
కరీంనగర్‌లో ఒకే మైనారిటీ ఇంట్లో 200 ఓట్లు ఉన్నాయని ఆరోప



**హైదరాబాద్ ఆగస్టు 26 (ప్రజాస్వరం):**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన ఆరోపణలపై ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలు నిరాధారమని, కరీంనగర్‌తో పాటు 8 నియోజకవర్గాల ప్రజలను అవమానించారని, వెంటనే క్షమాపణ చెప్పాలని ..మిగతా 2లో

# 'కోటా' చిక్కుముడి విప్పేదెలా?

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై పార్టీ పెద్దలు, న్యాయ కోవిదులతో మంత్రుల చర్చలు
జీవో ఇస్తే ఎదురయ్యే అడ్డంకులపై విశ్లేషణ
గతంలో మరాఠా రిజర్వేషన్లను కొట్టేస్తూ ఇచ్చిన తీర్పు పరిశీలన
బిహార్‌కు సీఎం రేవంత్, మంత్రులు..
రాహుల్ యాత్రకు సంఘీభావం



2

## మనదే అత్యుత్తమ జట్టు.. కప్ మనదే

ఆసియా కప్‌లో టీమిండియానే ఫేవరెట్ అన్న సెహ్వాగ్
సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీని ప్రశంసించిన వీరూ
మనదే అత్యుత్తమ జట్టని ధీమా వ్యక్తం చేసిన మాజీ ఓపెనర్
2026 టీ20 ప్రపంచకప్‌కు ఇది మంచి సన్నాహక టోర్నీ
యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్

**హైదరాబాద్ ఆగస్టు 26 (ప్రజాస్వరం):**

త్వరలో ప్రారంభం కానున్న ఆసియా కప్‌లో సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టే టైటిల్ గెలుస్తుందని టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ధీమా వ్యక్తం చేశాడు. ప్రస్తుతం టోర్నీలో పాల్గొంటున్న జట్లలో మనదే అత్యుత్తమ జట్టు అని, కప్‌ను నిలబెట్టుకోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పాడు.

ఆసియా కప్ అధికారిక బ్రాడ్‌కాస్టర్ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌తో ప్రత్యేకంగా మాట్లాడిన సెహ్వాగ్, భారత జట్టు సత్తాపై పూర్తి విశ్వాసం కనబరిచాడు. "మనం ప్రపంచ ఛాంపియన్లం. ఇటీవలే టీ20 ప్రపంచకప్ గెలిచాం. కాబట్టి ఆసియా కప్‌లో మనమే అత్యుత్తమ జట్టు అని నేను కచ్చితంగా చెప్పగలను. ఈసారి కూడా టైటిల్ మనమే గెలుస్తామని ఆశిస్తున్నాను" అని అన్నాడు.

సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీని సెహ్వాగ్ ప్రత్యేకంగా ప్రశంసించాడు. "మనకు చాలా మంచి జట్టు ఉంది. కెప్టెన్‌గా సూర్య ముందుండి నడిపిస్తున్నాడు. అతను టీ20 ఫార్మాట్‌లో ..మిగతా 2లో



## రాజీనామా చేసే ధైర్యం ఉందా..?

ఓటు చోరీకి పాల్పడితే అన్ని పార్లమెంట్ స్థానాలను బీజేపీయే గెలిచేదన్న ఎంపీ
అందరం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళదామా? అని సవాల్
కాంగ్రెస్ ఎనిమిది చోట్ల ఎలా గెలిచిందని ప్రశ్న

**హైదరాబాద్ ఆగస్టు 26 (ప్రజాస్వరం):**

పీసీసీ అధ్యక్షుడిగా ఏది పడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదని, ఓటు చోరీకి పాల్పడి ఉంటే దేశంలోని అన్ని పార్లమెంట్ స్థానాలను తామే గెలుస్తామని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని విమర్శించారు. తమ పార్టీ ఎంపీలందరం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళతామని, దానికి కాంగ్రెస్ సిద్ధమా? అని సవాల్ విసిరారు. రాజీనామా చేసే ధైర్యం ..మిగతా 2లో



## రేవంత్ సొల్లు పురాణం ఆపాలి

కోదండరామ్ పై ప్రేమ ఉంటే సీఎం చేయండి
కోదండరాంపై సీఎం రేవంత్ రెడ్డిది మొసలి కన్నీరు అంటూ శ్రవణ్ విమర్శలు
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోటీ చేయించాలని డిమాండ్
ఓయూకు రూ. 1000 కోట్లు ఇచ్చే దమ్ముందా అని ప్రశ్న



**హైదరాబాద్ ఆగస్టు 26 (ప్రజాస్వరం):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రొఫెసర్ కోదండరాంపై సీఎం చూపిస్తున్నది మొసలి కన్నీరేనని, ఆయన ప్రేమలో ఏమాత్రం నిజాయతీ లేదని అన్నారు. రేవంత్ రెడ్డికి కోదండరాంపై నిజంగానే ..మిగతా 2లో

## యూరియాపై రైతులు ఆందోళన చెందవద్దు

యూరియా సరఫరాను పెంచేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది
కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు
ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలను రైతులకు వెంటనే అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలి
యూరియా నిల్వలు, సరఫరాపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష



**హైదరాబాద్ ఆగస్టు 26 (ప్రజాస్వరం):**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు, సరఫరాపై ఐడీఓసీలో మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, పర్ణిక రెడ్డి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, డా. రాజేష్ రెడ్డి, డా. వంశీకృష్ణ, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ..మిగతా 2లో

## రైతుల ఆవేదనను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రాథమిక వైద్య సేవలు అందించడంలోనూ విఫలం
రైతు ఆత్మహత్య రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య
మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్ ఆగస్టు 26 (ప్రజాస్వరం):**

రైతుల ఆవేదనను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మండిపడ్డారు. తెలంగాణలో వ్యవసాయం పూర్తిగా కుప్పకూలిపోయిందనే విషాదాన్ని మరోసారి ఒక రైతు దుర్మరణం ..మిగతా 2లో

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
27.08.2025
బుధవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


# అసలు రేవంత్ రెడ్డి ఎవరు?

మొదటిపేజీ తరువాయి

ఏం పని?" అని ప్రశ్నించారు.

బీహార్‌తో రేవంత్ రెడ్డికి ఉన్న సంబంధం ఏమిటని, ఆయన స్థాయి ఏమిటని ప్రశాంత్ కిశోర్ నిలదీశారు. ఒకవైపు బీహార్ ప్రజలను అవమానించేలా మాట్లాడి, మరోవైపు అదే బీహార్‌కు ఓట్లు అడగడానికి ఎలా వస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి వైఖరిపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీహార్‌ను అవమానించే నాయకులను కాంగ్రెస్ కలిగి ఉందని, ఇది రాహుల్ గాంధీ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.



# పీసీసీ చీఫ్ ఒక గజినీ

## కాంగ్రెస్ మళ్లీ గెలిస్తే రాజకీయాలు వదిలేస్తా...

మొదటిపేజీ తరువాయి

డిమాండ్ చేశారు.

మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలపై బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని వ్యక్తి దొంగ ఓట్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. "గతంలో నేను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి దిగిపోయినప్పుడు, ఒక బీసీగా స్పందించానని చెప్పిన మహేశ్ గౌడ్, ఇప్పుడు నేను బీసీని కాదని చెప్పడం విడ్డూరం. ఆయన్ను చూస్తే నాకు గజినీ సినిమా గుర్తుకొస్తోంది" అంటూ ఎద్దేవా చేశారు. దొంగ ఓట్ల గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు, జగిత్యాలలో జరిగిన ఓట్ల చోరీ గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు.

అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బండి సంజయ్ ధ్వజమెత్తారు. "మహిళలకు ఇస్తామన్న రూ. 2,500, పెంచుతామన్న పింఛన్లు, నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు, తులం బంగారం, స్కూటీలు ఎక్కడికి పోయాయి రేవంత్ రెడ్డి?" అని నిలదీశారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేశారని, త్వరలోనే ప్రజలు కాంగ్రెస్ నేతలను రాళ్లతో కొట్టే పరిస్థితి వస్తుందని విమర్శించారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటివరకు నయా పైసా కూడా విడుదల



చేయలేదని దుయ్యబట్టారు.

బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చే ప్రయత్నం చేస్తోందని బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్‌లోని కొన్ని మైనారిటీ ఇళ్లలో ఒక్కో ఇంట్లో 200 ఓట్లు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందూ ధర్మం, సనాతన ధర్మం కోసం బీజేపీ ఎప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

"భైంసాలో హిందువుల ఇళ్లు తగలబెట్టినప్పుడు ఈ కాంగ్రెస్ నేతలు ఎక్కడికి పోయారు? హిందూ పండుగలకు గుళ్లలో సౌండ్ పెట్టొద్దని చెప్పడం దుర్మార్గం" అని మండిపడ్డారు. యూపీఏ హయాంలోనే దేశంలోకి రోహింగ్యాలు పెద్ద ఎత్తున ప్రవేశించారని, టోపీలు పెట్టుకుని డ్రామాలు ఆడేది కాంగ్రెస్ నేతలేనని ఆయన విమర్శించారు.

# రేవంత్ సొల్లు పురాణం ఆపాలి

మొదటిపేజీ తరువాయి

ప్రేమ ఉంటే, వెంటనే ఆయనకు ముఖ్యమంత్రి పదవిని అప్పగించాలని డిమాండ్ చేశారు.

సీఎం పదవికి రేవంత్ కంటే కోదండరామే అన్ని విధాలా అర్హులని శ్రవణ్ అభిప్రాయపడ్డారు. కనీసం కోదండరాంతో మంత్రిగానైనా ప్రమాణ స్వీకారం చేయించాలని, రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీకి నిలబెట్టాలని అన్నారు. ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడింది అంతా సొల్లు పురాణమేనని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి దమ్ముంటే తక్షణమే ఓయూకు వెయ్యి కోట్ల రూపాయల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం న్యాయస్థానాల పరిధిలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు గురించి సీఎం ఎలా మాట్లాడతారని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా కోర్టులను, న్యాయమూర్తులను అవమానిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం కోసం శ్రీకాంతాచారి, యాదయ్య వంటి వారు ఆత్మబలిదానాలు చేసుకున్నప్పుడు రేవంత్ రెడ్డి.. చంద్రబాబు నాయుడు సంకలో



ఉన్నారని ఆయన విమర్శించారు.

అదేవిధంగా, రాష్ట్ర అప్పుల విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అబద్ధాలు చెబుతున్నారని దాసోజు శ్రవణ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పు రూ. 3,50,520 కోట్లు మాత్రమేనని పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రి వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందనే భయం సీఎం రేవంత్ రెడ్డిలో స్పష్టంగా కనిపిస్తోందని దాసోజు శ్రవణ్ వ్యాఖ్యానించారు.

# రాజీనామా చేసే ధైర్యం ఉందా..?

మొదటిపేజీ తరువాయి

ఉందా? అని ప్రశ్నించారు.

మేం ఓట్ల చోరీకి పాల్పడినట్టయితే, తెలంగాణలో కాంగ్రెస్ ఎనిమిది చోట్ల ఎలా గెలిచింది, అసదుద్దీన్ ఒవైసీ ఎలా విజయం సాధించారని నిలదీశారు. దమ్ముంటే మీ ఎనిమిది మంది ఎంపీలతో రాజీనామా చేయించాలని, తాము కూడా రాజీనామా చేస్తామని అన్నారు. కొత్త ఓటరు లిస్టుతో మళ్లీ ఎన్నికలకు వెళదామని వ్యాఖ్యానించారు. అప్పుడు వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుస్తాయని అన్నారు.

బీజేపీని అడిగి కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇచ్చారా అని ప్రశ్నించారు. కుంటిసాకులు చెప్పకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై నిజాయతీగా కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలని ఆయన అన్నారు. రాష్ట్రప్రభుత్వం నిర్వహణ లోపం కారణంగానే యూరియా కొరత తలెత్తిందని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని యూరియా కొరత ఇక్కడే ఎందుకు ఉందని ప్రశ్నించారు.



# కోటా చిక్కుముడి విప్పేదెలా?

- స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై పార్టీ పెద్దలు, న్యాయ కోవిదులతో మంత్రుల చర్చలు
- జీవో ఇస్తే ఎదురయ్యే అడ్డంకులపై విశ్లేషణ
- గతంలో మరాఠా రిజర్వేషన్లను కొట్టేస్తూ ఇచ్చిన తీర్పు పరిశీలన
- బిహార్‌కు సీఎం రేవంత్, మంత్రులు.. రాహుల్ యాత్రకు సంఘీభావం

హైదరాబాద్ ఆగస్టు 26 (ప్రజాస్వరం):

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై చట్టపరంగా ఎదురయ్యే చిక్కుముళ్లను విప్పేందుకు మంత్రుల బృందం పార్టీ పెద్దలు, న్యాయ నిపుణులతో భేటీ అయింది. రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఆమోదించిన రెండు బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లోనే ఉన్నందున దీనిని చట్టపరిధిలో పరిష్కరించే మార్గాలపై సమాలోచనలు చేసింది.

ఒకవేళ జీవోలు ఇస్తే ఎదురయ్యే సవాళ్లు, దీనిని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన కార్యాచరణ, కులగణన ద్వారా వచ్చిన ఎంపిరికల్ డేటాను న్యాయవ్యవస్థల ముందుంచే అంశాలపై క్షుణ్ణంగా చర్చించింది. 50శాతానికి మించి రిజర్వేషన్లు అమలవుతున్న రాష్ట్రాలు, వాటిపై గతంలో కోర్టులు ఇచ్చిన తీర్పులు, రాజ్యాంగ నిబంధనలన్నింటిపైనా చర్చలు జరిపింది.

రిజర్వేషన్లపై మార్గాన్వేషణ: 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశంపై ఏర్పాటైన మంత్రుల కమిటీ సభ్యులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్ సోమవారం ఢిల్లీలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గంటపాటు భేటీ అయ్యారు.

ఇప్పటికే విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులు రాష్ట్రపతి కోసం వేచి చూస్తున్న విషయాలతోపాటు, 2018లో చంద్రశేఖర్ రావు రిజర్వేషన్లను 50శాతానికి పరిమితి చేస్తూ చేసిన చట్టాన్ని తొలగించాలన్న ఆర్డినెన్స్‌పైనా చర్చించారు. ఈ బిల్లుల ఆధారంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 263 ప్రకారం బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ జీవో ఇవ్వడమా?, ఇస్తే ఈ ఉత్తర్వుల అమలును ఇతరులెవరూ కోర్టుకు వెళ్లి అడ్డుకోకుండా ముందుగానే కేవియట్ దాఖలు చేయడమా? అన్న అంశాలపై మంత్రులు సమాలోచనలు చేశారు.



ఒకవేళ కోర్టులు అభ్యంతరం చెబితే కులగణన సర్వే ద్వారా సేకరించిన డేటాతో బీసీల జనాభా, వెనకబాటుతనాన్ని నిరూపించే అవకాశాలపైనా చర్చించారు. ఇప్పటికే 10శాతం ఈడబ్ల్యూస్ రిజర్వేషన్ల కోసం చేసిన 103వ రాజ్యాంగ సవరణతో విద్య, ఉద్యోగాల్లో మొత్తం రిజర్వేషన్లు 50శాతం దాటడాన్ని సుప్రీంకోర్టు సమర్థించిన దృష్ట్యా, సర్వే డేటాలోని అంశాలు తమకు కలిసి వస్తాయనే అభిప్రాయం వ్యక్తమైంది.

50 శాతం రిజర్వేషన్లు దాటితే సమానత్వపు హక్కు ఉల్లంఘన జరిగినట్లేనని, అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే 50శాతం పరిమితిని దాటవచ్చని సుప్రీంకోర్టు.. గతంలో మరాఠాల రిజర్వేషన్‌లపై తీర్పుఇచ్చిన నేపథ్యంలో ఎంపిరికల్ డేటాను ఎంతవరకు ప్రామాణికంగా చూపవచ్చనే అంశంపైనా చర్చించారు. హైకోర్టు విధించిన గడువు సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితుల్లో అదనపు గడువు కోరే అవకాశాలపైనా చర్చలు జరిగాయి. అయితే ఈ నెల 29న జరిగే కేబినెట్ భేటీలో చర్చించి తుది నిర్ణయం చేయనున్నారు.

# రైతుల ఆవేదనను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

రుజువు చేసిందన్నారు. అప్పుల భాదతో మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఈర్లపల్లిలో రవి నాయక్ అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలిచివేసిందని మంగళవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆసుపత్రులు చూపిన నిర్లక్ష్య వైఖరి రైతు మరణానికి కారణం అయిందని దుయ్యబట్టారు. ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో కూడా విఫలం అయిందని, ఇది కేవలం ఆసుపత్రుల నిర్లక్ష్యం కాదు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య అని మండిపడ్డారు. రైతులను నిరాశలోకి నెట్టి, ఇటు జీవితంలో అటు



మరణంలోనూ వారికి గౌరవం లేకుండా చేసినందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# మనదే అత్యుత్తమ జట్టు.. కప్ మనదే

మొదటిపేజీ తరువాయి

ఓ టాప్ ప్లేయర్. గతంలో స్కై కెప్టెన్సీలో మనం ఎన్నో టీ20 మ్యాచ్‌లు గెలిచాం. అతని నాయకత్వంలో ఈసారి కూడా అద్భుతంగా రాణిస్తామని, ఆసియా కప్ గెలుస్తామని నమ్ముతున్నాను" అని వివరించాడు.

2026లో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్‌కు సన్నద్ధమయ్యేందుకు ఈ ఆసియా కప్ ఒక గొప్ప అవకాశమని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. "ఈ టోర్నీ ద్వారా కొత్త ఆటగాళ్లకు అవకాశం ఇవ్వొచ్చు. ప్రపంచకప్ కోసం జట్టును సిద్ధం చేసుకోవచ్చు. మన బలాన్ని పరీక్షించుకోవడానికి ఇంతకంటే మంచి అవకాశం ఉండదు" అని తెలిపాడు. జట్టు ఎంపికపై వస్తున్న విమర్శలను పక్కనపెడుతూ, సెలక్టర్లు అత్యుత్తమ జట్టునే ఎంపిక చేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశాడు.




యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు ఆసియా కప్ జరగనుంది. ఈ టోర్నీ టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. గ్రూప్‌ఏలో ఉన్న భారత్, సెప్టెంబర్ 10న యూఏఈతో తొలి మ్యాచ్ ఆడనుంది. సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో, 19న ఒమన్‌తో తలపడనుంది.

# గణేష్ మండపాల దగ్గర విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**మండప నిర్వాహకులు, ప్రైవేట్ ఎలక్ట్రిషన్లకు ప్రత్యేక సూచనలు చేసిన ఎస్పీ రావుల గిరిధర్.**

**వనపర్తి ప్రతినిధి,ఆగష్టు 26 (ప్రజాస్వరం):** వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేసే గణేష్ మండపాల దగ్గర విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండపాల నిర్వహకులు, ప్రైవేట్ ఎలక్ట్రిషన్లకు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. మండపాలను విద్యుత్ లైన్ల కింద లేదా విద్యుత్తు లైన్లకు, ట్రాన్స్ఫార్మర్లకు దగ్గరగా ఏర్పాటు చేయరాదని చెప్పారు. మండపాలలో ఎర్త్ లీకేజ్ సర్క్యూట్ బ్రేకర్ మరియు అవసరమైన ఎంసిబి లు ఏర్పాటు చేయాలని కోరారు. మండపాల వైరింగ్ ను లైసెన్స్ పొందిన ఎలక్ట్రిషన్ ద్వారానే చేయించాలని, వైరింగ్ లో ఎక్కడ జాయింట్ లేకుండా చూసుకోవాలని సూచించారు. కనెక్ట్ అయిన లోడుకు సరిపోయే రేటెడ్ కేబుల్ వైర్లు, సరైన ఇన్సులేషన్ తో ఉపయోగించాలని సర్వీస్ కేబుల్స్ హుకింగ్ చేయరాదన్నారు. విద్యుత్ వైర్లు ఇనుప పైపులకు తగలకుండా చూడాలని అవసరమైతే తగిన ఇన్సులేషన్ పెట్టాలన్నారు. వైర్లు నేల మీద వేయకుండా తప్పనిసరి వేయాల్సివస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సరైన ఎర్తింగ్ తో త్రీ పిన్ ప్లగ్ ఉపయోగించాలని తెలిపారు. మండపాల నిర్మాణంలో ఇనుప పైపులు వాడితే వాటిని ఇన్సులేషన్ పదార్థంతో కవర్ చేయాలని సర్వీస్ వైరు పోలుకు ఫిక్స్ చేసిన తర్వాత సంబంధిత లైన్మెన్ లేదా జూనియర్ లైన్మెన్ అనుమతి లేకుండా మార్పులు చేయరాదని చెప్పారు.ఇన్వర్టర్ లేదా జనరేటర్ వాడికి రిటర్న్ కరెంటు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



# యూరియాపై రైతులు ఆందోళన చెందవద్దు

హైదరాబాద్ ఆగస్టు 26 (ప్రజాస్వరం):

వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా విషయంలో కలెక్టర్లు జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలను రైతులకు వెంటనే అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులు, అధిక ధరలకు విక్రయించే

ఫెర్టిలైజర్స్ షాప్ డీలర్స్ పై కేసులు నమోదు చేయాలని, వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై, వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్లు ప్రెస్ మీట్ లు పెట్టి రైతులకు భరోసా కల్పించాలని, .స్టాక్ వివరాలు వెల్లడించి, రైతుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించాలి సూచించారు.

ముఖ్యంగా ప్రైవేట్ డీలర్ ల వద్ద ఉన్న స్టాక్ సక్రమంగా సరఫరా అయ్యేలా ఆయా జిల్లా కలెక్టర్ లు చర్యలు తీసుకోవాలని అన్నారు.

యూరియా వ్యవసాయ సీజన్ ముగిసే వరకు ప్రతి ఎరువుల షాప్,పి. ఏ.సి.ఎస్ , ఆగ్రో సేవా కేంద్రాల వద్ద ఒక్కొక్క షాప్ కు ఒక అధికారిని నియమించాలని,వారికి బాధ్యతలు అప్పగించాలని, యూరియా ఇండెంట్ ఎంత వచ్చింది స్టాక్ లభ్యత ఎంత ఉంది,ఎంత సరఫరా చేశారు? తదితర విషయాలపై పక్కాగా మానిటర్ చేయాలని అన్నారు. పోలీస్ అధికారులు కూడా వ్యవసాయ అధికారులు, ప్రతి షాప్ వారిగా నియమించిన అధికారులతో సమన్వయం చేసుకోవాలని, యూరియా సరఫరాలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు

రాబోయే రబీ సీజన్ కు సంబంధించి రైతులకు ఎంత యూరియా అవసరమో అంచనా వేసి, వాస్తవ లెక్కలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వానికి ఇండెంట్ పంపాలని, ఆ ప్రతిపాదనలు బట్టి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇండెంట్ పంపుతుందని వివరించారు.

అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ--- రాష్ట్రాలకు యూరియా కేటాయింపుల కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటాయని, రాష్ట్రాల అవసరాలకు తగ్గట్లుగా యూరియా సరఫరా చేయాల్సిన కేంద్రం తెలంగాణకు సహకరించడం లేదన్నారు. కేంద్రం తెలంగాణకు ఖరీఫ్ సీజనుకు 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని, కానీ ఇప్పటివరకు కేవలం 6.6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియానే సరఫరా చేసిందని, ఇంకా 3 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉందని, దీంతో రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందన్నారు. కానీ ప్రతిపక్ష పార్టీలు అసత్య ప్రచారాలు చేస్తూ--- కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయని మండిపడ్డారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

యూరియా సరఫరా సరఫరాను పెంచేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. రైతుల అవసరాలను తీర్చడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ మాట్లాడుతూ.. నాగర్ కర్నూలు జిల్లాలో 5,38,462 ఎకరాల్లో పంట సాగు జరుగుతుందని అందుకు అనుగుణంగా 34942 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటివరకు 21186 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, నేటి వరకు 20297 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని, ప్రస్తుతం 889 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలో అందుబాటులో ఉందని, సెప్టెంబర్ 30 నాటికి జిల్లాకు 13755 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంత్రికి వివరించారు.

జిల్లావ్యాప్తంగా ఉన్న 22 ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలు,33 రైతు ఆగ్రో సహాయ కేంద్రాలు, 236 ప్రైవేటు క్రిమిసంహారక విక్రయ దుకాణాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో ఎక్కడా కొడత లేకుండా విక్రయ కేంద్రాల ద్వారా పకడ్బందీగా యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రతి యూరియా విక్రయ కేంద్రం వద్ద ఒక ప్రభుత్వ అధికారిని నియమించి విక్రయాలను పారదర్శకంగా కొనసాగేలా ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

నాగర్ కర్నూల్ శాసనమండలి సభ్యులు కుచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ....

జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా యూరియాను అందించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేయాలన్నారు.

ముఖ్యంగా ప్రైవేట్ విక్రయ కేంద్రాల వద్ద అధిక ధరలు వసూలు చేయకుండా చూడాలని ఆయన సూచించారు.

నియోజకవర్గాల వారీగా డీలర్లు, ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు కలెక్టర్లు చేయాలని కోరారు.

నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. నాగర్ కర్నూలు నియోజకవర్గ పరిధిలోని తాడూరు తిమ్మాజీపేట మండలాల్లో గతంలో జడ్చర్ల నుండి రైతులు తెచ్చుకునేవారు అని ప్రస్తుతం అక్కడ యువనందుకు స్థానికంగా కొనుగోలు చేసేందుకు రైతులు అధికంగా విక్రయ కేంద్రాలకు వస్తున్నారని అందుకు సరిపడా యూరియాను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేటు డీలర్లు అధిక రెట్లు బ్లాక్ మార్కెట్ను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ...అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ పదర మండలాల్లో యూరియా కొరత ఉందని, రైతుల అవసరాలకు అనుగుణంగా పంపిణీ చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు అందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ అవసరమైన యూరియాను ఆయా మండలాలకు పూర్తిస్థాయిలో యూరియాను పంపిణీ చేస్తున్నట్లు చేరవేసినట్లు కలెక్టర్ తెలిపారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ....కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో వెల్దండ మండలంలో యూరియా కొరత అధికంగా ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ నిన్న రాత్రి జిల్లాకు వచ్చిన యూరియా నిలువలనుండి కల్వకుర్తి నియోజకవర్గానికి చేరవేసినట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.



# జనహిత పాదయాత్రలో కనిగిరి లింగం





**మనోహరబాద్ ( ప్రజాస్వరం ) :** పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ లు చేపట్టిన జనహిత పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని టీ పీసీసీ మాజీ కార్యవర్గ సభ్యులు కనిగిరి లింగం అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలో ని కాట్యాల నుండి వర్ధన్నపేట వరకు జరిగిన పాదయాత్రలో పీసీసీ జనరల్ సెక్రటరీ శాబెర్ అలీతో కలిసి పాల్గొన్నట్లు కనిగిరి లింగం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యేలు మురళి నాయక్, నాగరాజు, యశస్విని రెడ్డి, మేయర్ సుధారాణిల తో పాటు భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రజలతో మమేకమవడం మంచి అనుభూతి కలిగించిందన్నా రు. ప్రభుత్వం చేపడుతున్న అభివృ ద్ధి తో పాటు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేకూరు వస్తున్నాయని అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీ లతో అధిక స్థానాలను కైవసం చేసు కోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. ఈ పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయి కుమార్ తోపాటు పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# వికారాబాద్ కలెక్టరేట్‌లో మట్టి గణపతుల పంపిణీ

**వికారాబాద్, ఆగస్టు 26(ప్రజా స్వరం):** వికారాబాద్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లో వినాయక చవితి వేడుకను పురస్కరించుకుని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సుధీర్ మరియు అసిస్టెంట్ కలెక్టర్ హార్స్ చౌదరి లతో కలిసి అధికారులకు, ఉద్యోగులకు మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భం గాఅదనపు కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లా లో 12000 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి "గణపతి విగ్రహాలను చెరువుల మట్టి తో తయారు చేసి చెరువు లోనే నిమజ్జనం చేద్దాం" పోస్టర్ ను విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను కాలుష్య నియం త్రణ మండలి ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యత కోసం మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలన్నారు.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర రసాయనిక రంగులతో రూపొం దించిన విగ్రహాల కారణంగా జల వనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజ లందరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి, పర్యా వరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అధికారి రేణుకా దేవి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ సిధార్థ, జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణ వేణి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగు లు తదితరులు పాల్గొన్నారు.



# వినాయక ఉత్సవాలకు సహకరిస్తాం




**పరిగి, ఆగస్టు 26(ప్రజా స్వరం) :** పరిగి నియోజకవర్గ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిం చిన పీస్ కమిటీ వినాయక చవితి కి సంబంధించిన మండపాల లో తీసుకోవలసిన జగ్రత ల గురించి వివరించారు. వివిధ పార్టీల నాయకులు ఈ సమావే శంలో పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో పాల్గొని, వినాయక ఉస్సవాలు సజావుగా జరగాలని , అన్ని విధాలుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు అందరూ కలిసి పోలీస్ శాఖ కు సహకరిస్తాం అని, ప్రజలకు పూర్తి స్థాయిలో రక్షణ చర్యలు తీసుకోవాలని పరిగి మండల వివిధ పార్టీల నాయకులు పీస్ కమిటీ సమా వేశంలో తెలిపారు.



# ఎంపీని కలిసిన నూతన కమిటీ సభ్యులు

**మెదక్, ఆగస్టు 26 (ప్రజా స్వరం) :** మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మంగళవారం మెదక్ జిల్లా బిజెపి నూతన కమిటీ సభ్యులు మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సంఘసాని సురేష్, రంజిత్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చేష్ యాదవ్, నారాయణ రెడ్డి, రాజేందర్, శంకర్ గౌడ్, జిల్లా కార్యదర్శిలు బిక్షపతి, సత్యనారాయణ అశోక్ సదుల్లా తదితరులు పాల్గొన్నారు.




# యూరియా కోసం రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం గోదాం దగ్గర రైతుల పడుతున్న ఆవేదన
- పట్టించుకోని నాయకులు లేరని హరిగోశ పడుతున్న రైతులు

**ముక్తల్ ప్రతినిధి ఆగస్టు 26(ప్రజాస్వరం):** అమరచింత మండల కేంద్రంలో ఆగ్రో రైతు సేవ కేంద్రం గోదాం వద్ద ఉదయం నాలుగు గంటల నుంచి యూరియా కోసం బారులు తీరిన రైతాంగం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుచూపు ఆలోచన లేక రైతులను అరిగోష పెడుతున్నాడు ఇలాంటి ముఖ్యమంత్రిని 30 సంవత్సరాల నుండి ఎన్నడూ చూడలేదు రైతులను చిన్నచూపు చూస్తున్న ఈ ప్రభుత్వని గద్దె దించాలి. ఈ సీజన్లో యూరియా కొరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం ప్రతిరోజు లైన్లో నిలబడుతున్నాం అయినా యూరియా దొరకడం లేదు ఒక మంత్రి పట్టించుకోడు ఒక నాయకుడు పట్టించుకోడు ఎన్నో గ్యారంటీలు చెప్పి గద్దినెక్కిన రేవంత్ రెడ్డి నీ గ్యారెంటీలు అమలు చేస్తావో చేయవో కానీ రైతులకు మాత్రం యూరియాను అందించి మమ్మల్ని ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# విశాఖపట్నం మధురవాడ కళింగ వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున వినాయక చవితి శుభాకాంక్షలు

**మధురవాడ, ఆగష్టు 26(ప్రజాస్వరం):** ఆదిదేవుడు వినాయకుని ఆశీస్సులు మధురవాడ కళింగ వైశ్య కుటుంబాలకి ఉండాలని ఆకాంక్షిస్తూ అదే సమయంలో పర్యావరణహితంగా పూజలు చేసుకోవాలని ప్రజలందరికీ తెలియజేసే క్రమంలో మధురవాడ కళింగ వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ మధురవాడ విస్కేర్ ఉత్తరాంధ్ర చిరుతిల్లు షాపు వద్ద పంపిణీ కార్యక్రమం జరిగింది ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఢిల్లీ పబ్లిక్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత ఊన్నా వంశీ మరియు వూనా శ్రీ ప్రోడక్ట్స్ అధినేత వూన బాలకృష్ణ ఆర్థిక సహాయంతో పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సందర్భంగా మధురవాడ కళింగ వైశ్య గౌరవ సలహాదారులు పొట్నూరు మురళీ మోహనరావు మాష్టారు మాట్లాడుతూ మట్టిలోంచే సకల ప్రాణులు, సంపదలు వచ్చాయని మనం చాలాసార్లు చెప్పుకున్నాం. అది ఒక కారణమైనా..మట్టి వినాయకుని చేయాలంటే చెరువుల నుంచి బంకమట్టిని సేకరించాలి. ఇంటికో గంపెడు మట్టి తీయడం వల్ల, అందరూ తమకు తెలియకుండానే తలో చెయ్యివేసి, చెరువుల్లో పూడిక తీసినట్టవుతుంది. చెరువుల్ని బాగు చేసినట్టవుతుంది. ఇదీ ఓ కారణమైనా..అసలు కారణం మరొకటి ఉంది. అసలు వినాయకుడు పుట్టింది పార్వతీదేవి మేని నలుగు మట్టి నుంచే కదా. అందుకే ఆయన విగ్రహాన్ని మట్టితోనే చేయాలి. మట్టి వినాయకునే పూజించాలి. అప్పుడే... భక్తి.. ముక్తి.. శక్తి. అలాగే మట్టి వినాయకుడిని పూజించడం అంటే మన ప్రకృతిని పూజించడంతో సమానం. అని తెలిపారు. ఈ కార్యక్రమంలో. మధురవాడ కళింగ వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు భోగి సాంబశివరావు, అధ్యక్షులు కిల్లం శెట్టి రంగనాథం, ఉపాధ్యక్షులు గెంబలి కిషోర్, ప్రధాన కార్యదర్శి పొట్నూరు గణేష్, ట్రెజెరర్ వైశ్య రాజు శ్రీలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్,జాయింట్ సెక్రెటరీ వూన బాలకృష్ణ , కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# హైదరాబాద్ మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం.. ఐదుగురు విద్యార్థులకు పాజిటివ్!

- రెస్టారెంట్ యజమాని సమాచారంతో పోలీసుల దాడులు
- కిలోన్నర గంజాయి, ఓజీ వీడ్ స్వాధీనం
- ఢిల్లీ నుంచి కొరియర్‌లో మాదకద్రవ్యాల సరఫరా

**హైదరాబాద్ ఆగస్టు 26(ప్రజాస్వరం):** హైదరాబాద్‌లోని ప్రముఖ మహీంద్రా యూనివర్సిటీలో మాదకద్రవ్యాల వాడకం వెలుగులోకి రావడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. ఐదుగురు విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ కావడం ఆందోళన కలిగిస్తోంది. ఓ రెస్టారెంట్ యజమాని ఇచ్చిన కచ్చితమైన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు వర్సిటీలో సోదాలు జరిపి భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. 50 మంది విద్యార్థులను దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే, మల్నాడు రెస్టారెంట్ యజమాని ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు మహీంద్రా యూనివర్సిటీలో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో కిలోన్నర గంజాయితో పాటు 47 గ్రాముల ఓజీ వీడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. శ్రీమారుతి కొరియర్ సర్వీస్ ద్వారా ఢిల్లీ నుంచి ఈ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. గతంలో విద్యార్థులు నిక్ అనే నైజీరియన్ నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసి నగరంలోని పలు పబ్‌లలో పార్టీలు చేసుకున్నట్లు కూడా గుర్తించారు. డ్రగ్స్ బారిన పడిన విద్యార్థులకు పోలీసులు ప్రస్తుతం కౌన్సెలింగ్ ఇస్తున్నారు.




# విశ్వమాత మదర్ థెరీసా

- ప్రేమకు ప్రతిరూపం... దీనుల దేవత మదర్ థెరీసా
- సేవకు మారుపేరు, ప్రేమకు ప్రతిరూపం మదర్ థెరీసా
- సాక్షాత్తు మదర్ థెరిసా రూపాని ప్రతిబింబించిన విద్యార్థినిలు
- మదర్ థెరీసా 115 వ జన్మదిన వేడుకలు నిర్వహించిన సెయింట్ జూడ్స్ ప్రైమరీ స్కూల్ యాజమాన్యం
- విద్యార్థిని విద్యార్థులతో కలిసి మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలవేసిన పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 26(ప్రజాస్వరం):** మదర్ థెరిసాను ప్రపంచం మొత్తం విశ్వమాత గా భావిస్తారని సెయింట్ జూడ్స్ ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్ ఉషారాణి అన్నారు. మంగళవారం నాడు దీనుల దేవత ప్రేమకు ప్రతిరూపమైన నోబెల్ బహుమతి గ్రహీత మదర్ థెరిసా 115 వ జన్మదిన వేడుకలను సెయింట్ జూడ్స్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థుల పాఠశాల యాజమాన్యం సమక్షంలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి మాట్లాడుతూ శాంతి, సహనం, ప్రేమకు ప్రతిరూపం మదర్ థెరిసా అని ఉషారాణి అన్నారు. మదర్ థెరిసా దీనుల పాలిట దేవతగా నిలిచారని ఉషారాణి మదర్ థెరిసాను కొనియాడారు. జాతి, వైశ్యామ్యాలు లేకుండా దీనులకు అండగా నిలిచిన మాతృమూర్తి అని ఆమె అన్నారు. మనుషులలోనే దేవుడిని చూసిన వ్యక్తి మదర్ థెరిసా అని ఉషారాణి అన్నారు. నిస్సహాయులకు నిరంతరం సహాయం అందించి విశ్వమాతగా నిలిచారని, ఆమె సేవలు చిరస్మరణీయమని ఉషారాణి అన్నారు. దేవుళ్లను పూజిస్తారు కొలుస్తారు కానీ వారి కళ్ళ ముందు బాధపడే అభాగ్యులు, నిరాశ్రయులు, అనాధలు, జబ్బుతో ఉన్న వారిని గురించి పట్టించుకునే వారు చాలా తక్కువగా ఉంటారని ఉషారాణి అన్నారు. ఆధ్యాత్మికత మనకు ఆత్మే పరమాత్మ అని బోధిస్తుందని భక్తితో కొలిచే భగవంతుడిని అంతట చూడగలగాలి అన్నారు. మానవసేవే మాధవ సేవ అని , సాటివారికి సహాయపడి మానవత్వం కలవారుగా నిరూపించుకున్న వారే మహనీయులవుతారని ఆమె అన్నారు. అలాంటి మహనీయుల జాబితాలలో ఒక గొప్ప స్థానాన్ని సంపాదించుకున్న వ్యక్తి మదర్ థెరిసా అన్నారు. అభాగ్యుల సేవే తన లక్ష్యమని, దీనులకు సేవ చేయాలని తన సొంత నేలను వదిలి వచ్చిందని మదర్ థెరిసా ను కొనియాడారు. కాటన్ చీర కట్టి భారతీయ పౌరసత్వం స్వీకరించి మురికి వాడలో ప్రవేశించి మోతీ జిల్ లో ఒక పాఠశాలను స్థాపించిందని ఉషారాణి తెలిపారు. నిరాశ్రయులు, కుంటివారు, కుష్టివారు, ప్రేమించబడని వారు, సమాజం నిరాకరించబడిన వారు, భారమైన వారు మొదలైన వారిందరిని జాగ్రత్తగా చూసుకోవడమే ఆమె కర్తవ్యం గా భావించిందని ఉషారాణి తెలిపారు. కుష్టి వ్యాధిగ్రస్తులకు శాంతి నగర్ అనే పేరుతో ధర్మశాలను ప్రారంభించారని ఆమె తెలిపారు. కుష్టి వ్యాధిగ్రస్తులకు, అనాధ పిల్లలకు, సేవలందించినందుకు గాను ది గ్రేటెస్ట్ ఇండియన్ పోల్ లో మదర్ తెరిసా ఐదో స్థానంలో నిలిచారన్నారు. నేటి సమాజం మదర్ థెరిసా నుండి సేవా దృక్పథం అలవర్చుకొని ముందుకు సాగాలని, అంతేకానీ ప్రచారాలు, ప్రశంసల కోసం చేసే పనులను పుణ్య కార్యాలు అనిపించుకోవాలని ఉషారాణి అన్నారు. ఏ చిన్న సేవ అయినా నిస్వార్థంగా చేయడం చాలా ముఖ్యమని ఉషారాణి తెలిపారు. నేడు మదర్ థెరిసా జన్మదిన సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు మదర్ థెరిసాలా చక్కగా తయారై చూపరులను ఆకట్టుకున్నారు. అంతేకాక మదర్ థెరిసా చేసిన సేవలను విద్యార్థినిలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నేటి సమాజం నిస్వార్థం లేని సేవతో ముందుకు సాగాలని విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పోచమ్మ తల్లికి పోటెత్తిన భక్త జనం పండుగ ఉత్సవాలు

**మోట్లంపల్లి గ్రామంలో బోనంకుండలతో బయలుదేరిన మహిళలు.**

**మక్తల్ ప్రతినిధి ఆగస్టు, 26(ప్రజాస్వరం):** ఆత్మకూరు మండలంలోని మోట్లంపల్లి గ్రామ పెద్దలకు సమక్షంలో పోచమ్మ తల్లి ఉత్సవాలకు పోటెత్తిన భక్త జనం. మంగళవారం మొట్లంపల్లి గ్రామంలో పోచమ్మ తల్లి పండుగను పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో మహిళలు బోనం కుండలతో బయలుదేరి పోచమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించారు. అదేవిధంగా మొక్కుబడిగా ఉన్న పొట్టేలు, కోళ్లను బలి ఇచ్చి తమ తమ మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో భక్తులు డోలు వైద్యాలతో మేళా తాళాలతో ఆటపాటలతో అంగరంగ వైభవంగా చూసేవారికి కన్ను విందుగా ఊరేగింపుగా పోచమ్మ గుడి దగ్గరికి బయలుదేరి నైవేద్యాలు సమర్పించి తమ మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ



పెద్దలు గడ్డం. బి ఆర్ ఎస్ గోవిందు, వడ్ల ఆనందు, కావలి రాజు, గొంగడి నరసింహ, కురువ శ్రీను, రంగారెడ్డి చిన్నారెడ్డి. ఈదన్న గడ్డం రాములు గడ్డం ఘటన ఆటో కురుమూర్తి తెలుగు రాములు వీరితో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గణపతి పండుగ వేళ పర్యావరణాన్ని కాపాడాలి

- చవితి శుభాకాంక్షలు తెలిపిన టి డబ్ల్యు జే ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి
- జి.రామ కృష్ణా రెడ్డి.



**వనపర్తి, ఆగస్టు 26(ప్రజాస్వరం):** గణపతి పండుగ వేళ ప్రతి ఒక్కరూ పర్యవరణమును కాపాడాలని వనపర్తి వర్కింగ్ జర్నలిస్ట్ ల ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగవరం రామ కృష్ణ రెడ్డి పిలుపును ఇచ్చారు. వినాయక చవితి సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగల ఆనందాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఎంత ముఖ్యమో, అంతే ప్రాధాన్యం పర్యావరణ పరిరక్షణకు ఇవ్వాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా ఎక్కువగా రసాయనాలతో తయారైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ప్రతిష్టించడం వల్ల నీటి వనరులు కాలుష్యం చెంది పర్యావరణానికి హాని కలుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యలు రాకుండా ప్రతి కుటుంబం మట్టి గణేశులను ప్రతిష్టించడమే సమాజానికి మేలని పిలుపునిచ్చారు. "మన సంప్రదాయం, భక్తి, ఆనందం కాపాడటంతో పాటు పర్యావరణానికి హాని కలగకుండా పండగను జరుపుకోవడం మనందరి బాధ్యత. చిన్నపిల్లలకు కూడా ఈ విషయాన్ని వివరించి, భవిష్యత్తు తరాలకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత తెలియజేయాలి," అని ఆయన అన్నారు. వినాయక చవితి పండుగ హిందూ మత విశిష్టతను ప్రతిబింబించడమే కాక సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించే గొప్ప సందేశాన్ని అందిస్తుందని గంగవరం రామ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గణపతి బాపా మహత్యాన్ని ప్రతి ఇంటిలో ఆచరణలో నిలబెట్టాలని, భక్తి భావంతో పూజలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే పండగల సందర్భంగా శబ్ద కాలుష్యం, ప్లాస్టిక్ వినియోగం, నీటి వృధా తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. చెట్లు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని, ఇది కూడా వినాయక చవితి సందర్భంలో ప్రతి ఒక్కరి సంకల్పంగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, అభివృద్ధి, ఆనందం నిండిపోవాలని, ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని గంగవరం రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు.

**గణపతి ప్రతిష్ట శుభముహూర్తాలు**

ఉదయం : 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు మధ్యాహ్నం : 11.45 గంటల నుంచి 1.15 గంటల వరకు సాయంత్రం : 4.30 గంటల నుంచి 6.00 గంటల వరకు పండితులు సూచించిన ఈ సమయాల్లో గణపతిని ప్రతిష్టించడం అత్యుత్తమం అని తెలిపారు.

# ఈ నెల 30 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..!!

**హైదరాబాద్ ఆగస్టు 26(ప్రజాస్వరం):** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 30వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు డెసిషన్ తీసుకుంది. మొత్తం 5 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. జస్టిస్ చంద్రఘోష్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి అందిన కాళేశ్వరం కమిషన్ నివేదికను సభలో ప్రవేశపెట్టనున్నారు. మరో వైపు బీసీ రిజర్వేషన్లపై కూడా అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం చర్చ జరపనుంది. ఈ క్రమంలో సభ్యుల సమావేశాల అనంతరం కాళేశ్వరంపై తదుపరి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోనున్నట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాల




ప్రారంభానికి ముందు ఈ నెల 29న రాష్ట్ర మంత్రి వర్గం సమావేశం కానుంది.

# స్థానిక సంస్థలకు అధికారులు సర్వం సిద్ధం చేసుకోవాలి : అదనపు కలెక్టర్

**ఆదిభట్ల ఆగస్టు 26(ప్రజాస్వరం):** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ఎప్పుడు ఎన్నికలు వచ్చిన సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో జిల్లా నోడల్ అధికారులు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీఓలు తదితరులతో ముందస్తు ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల వారీగా పోలింగ్ బూతులు, ఓటర్ లిస్టులు, పోలింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందికి సంబంధించి అన్ని సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఓటర్ జాబితాను కూడా సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం గణేష్ నిమజ్జనానికి సంబంధించి ఆయా మండలాల్లోని చెరువుల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని, నిమజ్జనం కొరకు గుర్తించిన చెరువులు, కుంటలు వద్ద భారీ కేడ్లు, క్రేన్లు అందుబాటులో ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు, ఎంపీడీవోలకు తెలియజేశారు. తదుపరి వనమహోత్సవంలో భాగంగా మండలాల వారిగా ఇచ్చిన లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ సిఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, సంబంధిత నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# కబడ్డీ క్రీడాకారుడి ఇతివృత్తమే 'అర్జున్ చక్రవర్తి'


**విశాఖపట్నం, ఆగష్టు 26(ప్రజాస్వరం):** కబడ్డీలో రాణించడానికి పడిన శ్రమ ఆధారంగా రూపొందించిన వాస్తవగాథ 'అర్జున్ చక్రవర్తి' చిత్రమని హీరో విజయ రామరాజు తెలిపారు. ఈ నెల 29న విడుదల కానున్న నేపథ్యంలో మంగళవారం విశాఖలోని దశపల్ల హోటల్లో చిత్ర బృందం సందడి చేసింది. కథానాయ కుడు విజయ రామరాజు మాట్లాడుతూ ఈ చిత్రానికి ఇప్పటికే మంచి స్పందన లభించిందని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టు కుంటుందన్నారు. అర్జున్ చక్రవర్తి అనే కబడ్డీ ఛాంపియన్ బయోపిక్ ను దర్శకుడు విక్రాంత్ రుద్ర తెరకెక్కించారన్నారు. "అర్జున్ చక్రవర్తి కేవలం సినిమా మాత్రమే కాదు నా తొమ్మిది సంవత్సరాల కల అని అన్నారు.. అనంతరం నిర్మాత శ్రీని గుబ్బల మాట్లాడుతూ ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్ వచ్చాయని. ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు. ఇటీవల ట్రైలర్ లాంచ్ చేశామని ఆద్యంతం ఆకట్టుకున్న ట్రైలర్ సినిమాపై అంచనాలని మరింత పెంచిందన్నారు. హీరో విజయ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశాడన్నారు..అనంతరం పుష్ప2 యాక్ట్ చేసిన దయానంద రెడ్డి మాట్లాడుతూ అర్జున్ చక్రవర్తిగా మైనస్ డిగ్రీల్లో షర్టు లేకుండా విజయరామరాజు నటించాడని. ఈ సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుందని నమ్మకం ఉందన్నారు. గొప్ప థియేట్రికల్ అనుభూతినిచ్చే సినిమా ఇది అని అన్నారు..హీరోయిన్ సీజా రోజ్ మాట్లాడుతూ "మా డైరెక్టర్ ఈ సినిమాను నెక్స్ లెవెల్‌లో తీశారని. మా నిర్మాత లేకపోతే ఇంత మంచి సినిమా లేదన్నారు. ఈ సినిమాతో చాలా మంచి సక్సెస్ వస్తుందని ఆశిస్తున్నాం"అని ఆమె తెలిపారు. యాక్టర్ దుర్గేష్ మాట్లాడుతూ "ఆగస్టు 29న ప్రో కబడ్డీ ప్రారంభమవుతుంది. అదే రోజున నేషనల్ స్పోర్ట్ డే. కబడ్డీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ సినిమా ఆ రోజున రిలీజ్ అవుతుంది"అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సినిమా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.





# ఘనంగా మునిసిపల్ కమిషనర్ జన్మదిన వేడుకలు.

**శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నేత గంధం పరంజ్యోతి.**

**వనపర్తి ప్రతినిధి ఆగస్టు 26(ప్రజాస్వరం):** వనపర్తి మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పుట్టినరోజు సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఛాంబర్ లో ఆయనను ప్రత్యేకంగా కలిసి కేకు తినిపించారు. పట్టణంలోని 33 వార్డులలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడని ఆయన హర్షం వ్యక్తం చేశారు.







# ఇలా చేస్తే వర్షాల్లో ఇంటి అందం డబుల్!

వానా కాలం వచ్చిదంటే చాలు వీధులన్నీ బురదమయంగా మారుతాయి. ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణం చిరాకు తెప్పిస్తుంది. ఫ్యామిలీతో సరదాగా బయటకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. ఈ సమయంలో ఇంట్లో అయినా మంచి వాతావరణం ఉండాలి.. అప్పడే కొంచెం ప్రశాంతంగా ఉండగల్గుతాం.. మరి ఈ వర్షా కాలంలో ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోవాలంటే ఏం చేయాలో చూసేయండి...

## డోర్ మ్యాట్స్.....

డోర్ మ్యాట్స్ ఇంటి అందాన్ని పెంచుతాయి. ప్లాస్టిక్, జూట్, రబ్బర్, ఫైబర్ సహా ఆధునిక అత్యాధునిక డోర్ మ్యాట్‌లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. కానీ వర్షా కాలంలో వర్షపు నీటిని పీల్చుకునే డోర్ మ్యాట్ లతో పాటు వివిధ డిజైన్ల డోర్ మ్యాట్ ల ఎంపిక ఉంటే మంచిది. అంతే కాకుండా ఫ్లోర్ మ్యాట్‌లలో ఆక్వాట్రాప్ మ్యాట్‌లను ఎంచుకోవడం మంచిది. ఇది తేమను గ్రహిస్తుంది.

## వాల్ హుక్స్....

వర్షా కాలం కావడంతో తడి రెయిన్‌కోట్‌లు, గొడుగులు తెచ్చి ఇంటింటా పెడితే ఇల్లు పాడవుతుంది. అందంగా కనిపించడం ఉండదు. అందువలన ఈ సమయంలో గోడ హుక్స్ ఉపయోగంలోకి వస్తాయి. అనేక రకాల హుక్స్ అందుబాటులో ఉన్నాయి కాబట్టి సరైనదాన్ని కొనుగోలు చేయడం ద్వారా ఇంటిని శుభ్రంగా ఉంచుకోవచ్చు. అలాగే ఇంటి అందం చెక్కుచెదరకుండా ఉంటుంది.

## ఆర్గనైజింగ్‌గా ఉండటం ముఖ్యం...


ఇంట్లో వస్తువులను చక్కగా అమర్చుకోవడం ముఖ్యం. వస్తువులను చక్కగా అమర్చండి. ఇది ఇల్లు చక్కగా కనిపించేలా చేస్తుంది. ఉపయోగించిన తర్వాత పదార్థాలను ఒకే చోట ఉంచడం ఇంటి సభ్యులకు అలవాటు చేయండి. వస్తువుల సరైన అమరిక ఇంటి రూపాన్ని మారుస్తుంది.

## పూలమొక్కలతో ఎంతో ఆహ్లాదం...

ఇంటి ముందు పూల తోటను సంరక్షించడానికి ఇది మంచి సమయం. ఈ సీజన్ మొక్కలు లేకుండా కుండలను నాటడానికి లేదా పూల మొక్కలను నాటడానికి అనువైనది. అలాగే పెరిగిన మొక్కలను కత్తిరించి శుభ్రంగా ఉంచాలి. ఇది మీ ఇంటి ముందు అందాన్ని పెంచుతుంది.

## బాల్కనీ చాలా స్పెషల్...

ఇంటి ముందు బాల్కనీ ఉంటే దానిని కూడా పూలతో అందంగా అలంకరించుకోవచ్చు. పూల కుండీలను పైన లేదా చిన్న మొక్కలకు వేలాడదీయవచ్చు. ఇది ఇంటి చుట్టూ పచ్చటి వాతావరణాన్ని సృష్టిస్తుంది.





# మెంతులతో ఇన్ని ప్రయోజనాలా..

**మెంతులు.. చూడడానికి ఇంతే ఉన్నా.. వాటిని తింటే మాత్రం బోలెడు ప్రయోజనాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఔషధ లక్షణాలు, ఆరోగ్య ప్రయోజనాల కోసం శతాబ్దాలుగా వీటిని ఉపయోగిస్తున్నారు. ఈ చిన్న, ముదురు పసుపు రంగు విత్తనాలు మీ ఆరోగ్యంలోని వివిధ అంశాలను మెరుగుపరచడంలో సహాయపడే పోషకాలతో నిండి ఉంటాయి. అవేంటో మీకోసం..**

**పోషకాలు సమృద్ధిగా:**

మెంతులు ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్, రాగి వంటి విటమిన్లతో పాటు అనేక ఖనిజాలకు మంచి మూలం. వీటిలో ప్రోటీన్, ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటాయి. ఇవి మీ ఆహారంలో పోషకమైన అదనంగా ఉంటాయి.

**జీర్ణక్రియకు తోడ్పడుతుంది:**

మెంతి గింజలలో కరిగే పీచు ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. ఇవి మలబద్ధకం నుండి ఉపశమనం కలిగించడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి అలాగే ఉబ్బరం తగ్గించడానికి సహాయపడతాయి.

**రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది:**

మధుమేహం ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మెంతులు సహాయపడతాయని తేలింది. అవి ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచగల లక్షణాలను కలిగి ఉంది. వీటిని తినడం ద్వారా భోజనం తర్వాత రక్తంలో చక్కెర పెరుగుదలను తగ్గించగల సమ్మేళనాలను కలిగి ఉంటాయి.

**వాపును తగ్గిస్తుంది:**

మెంతి గింజలలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. ఆర్థరైటిస్, ఇన్ఫ్లమేటరీ ప్రేగు వ్యాధి వంటి పరిస్థితులు ఉన్నవారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.

**గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది:**

మెంతులు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడం, గుండె పనితీరును మెరుగుపరచడం వంటి గుండె ఆరోగ్యకరమైన ప్రయోజనాలను కలిగి ఉన్నాయని కనుగొనబడింది. ఇవి ఎల్డిఎల్ (చెడు) కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

మెంతి గింజలను మీ ఆహారంలో చేర్చడం సులభం. మీరు వాటిని సలాడ్లు, సూప్లు లేదా కూరలలో చల్లుకోవచ్చు. లేదా వాటిని టీగా తయారు చేయవచ్చు. అయితే, ఇతర ఆహారాలు లేదా సప్లిమెంట్ల మాదిరిగానే ప్రతికూల ప్రభావాలను నివారించడానికి మెంతి గింజలను మితంగా తీసుకోవడం చాలా అవసరం.





# మీకు చుండ్రుందా..? బిర్యానీ ఆకులతో చెక్ పెట్టండి

ప్రస్తుతం చుండ్రు సర్వసాధారణ సమస్యగా మారిపోయింది. నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, కెమికల్స్‌తో కూడిన షాంపూలు వాడడం కారణం ఏదైనా.. చాలా మందిని చుండ్రు వేదిస్తోంది. దీంతో చుండ్రును తగ్గించుకోవడానికి మార్కెట్లో లభించే రకరకాల షాంపూలను, నూనెలను ఉపయోగిస్తుంటారు. అయితే ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఉపశమనం లభించకపోతే బిర్యానీ ఆకులతో నేచురల్ చిట్కా పాటిస్తే.. చుండ్రు ఇట్టే పరార్ అవుతుంది. ఇంతకీ చుండ్రును, బిర్యానీ ఆకులతో ఎలా తరిమి కొట్టేచ్చునేగా మీ సందేహం. అయితే ఈ స్టోరీలోకి వెళ్లాల్సిందే.

సాధారణంగా బిర్యానీ ఆకులు వంటకానికి రుచిని తీసుకురావడానికి ఉపయోగపడుతుందని తెలిసిందే. అయితే బిర్యానీలోని కొన్ని ఔషధ గుణాలు చుండ్రు సమస్యను దూరం చేస్తాయని మీకు తెలుసా.? అవును బిర్యానీ ఆకుల ద్వారా కేవలం చుండ్రు మాత్రమే కాకుండా.. తలపై ఉండే వాపు, దురద, దద్దుర్లు, పొడి బారడం వంటి సమస్యలను దూరం అవుతాయి. ఇంతకీ బిర్యానీ ఆకులతో హెయిర్ ప్యాక్‌ను ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

ఇందుకోసం ముందుగా.. కొన్ని బిర్యానీ ఆకులను తీసుకొని, కొన్ని నీళ్లు పోసుకొని బాగా మరిగించాలి. ఆకులు పూర్తిగా మరిగిన తర్వాత, చల్లార్చి బిర్యానీ ఆకులను మిక్సీ పట్టుకోవాలి. అలాగే అందులో.. కాస్త వేప ఆయిల్ లేదా అలోవెరా జెల్, ఉసిరి పొడి లాంటివి యాడ్ చేసి మిక్స్ చేయాలి. అనంతరం ఈ మిశ్రమాన్ని తలకు బాగా పట్టించాలి. ఇలా ఓ ఐదు నిమిషాలు మసాజ్ చేసిన తర్వాత పావుగంట పాటు ఆరబెట్టాలి.

# దిల్ రాజు చేతికి పవన్ కళ్యాణ్ 'ఓజీ' రైట్స్?



హరిహర వీరమల్లు లాంటి డిజాస్టార్ తర్వాత పవన్ కళ్యాణ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్). ఈ సినిమాకు రన్ రాజా రన్, సాహో చిత్రాలతో స్టార్ దర్శకుడిగా పేరు తెచ్చుకున్న సుజిత్ సైన్ దర్శకత్వం వహిస్తున్నాడు. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుంది. అయితే ఈ సినిమా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇప్పటినుంచే ప్రమోషన్స్ షురూ చేసింది చిత్రయూనిట్. ఇదిలావుంటే.. తాజాగా ఈ మూవీ నుంచి ఒక సాలిడ్ న్యూస్ వైరల్‌గా మారింది. ఈ సినిమా రైట్స్‌కి భారీ డిమాండ్ ఏర్పడగా.. ఓజీ నైజాం హక్కులను ప్రముఖ నిర్మాత దిల్ రాజు సొంతం చేసుకున్నారని తెలుస్తుంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ మూవీ డీల్ రూ. 46 కోట్లకు పలికినట్లు తెలుస్తోంది. ఇది నిజమైతే, నైజాం ఏరియాలో ఇది రికార్డు స్థాయి ధర అని చెప్పవచ్చు. అయితే, ఈ డీల్ గురించి అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. కాగా, ఈ సినిమా థియేట్రికల్ హక్కుల కోసం దిల్ రాజుతో పాటు మరికొందరు నిర్మాతలు కూడా పోటీ పడినట్లు సమాచారం.

# ఆ ఒక్కటీ అడక్కు..!



తమ కథానాయకుడి సినిమా గురించి ఎప్పుడెప్పుడు సరికొత్త అప్‌డేట్ వస్తుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. ఆ సినిమాలో పనిచేస్తున్న వారు కనిపిస్తే విలేకరులు కూడా పదే పదే అడుగుతారు. 'పుష్ప' చిత్రాల తర్వాత అల్లు అర్జున్ అట్లీ దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతికతతో ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన పనులు పర్యవేక్షిస్తున్ననిర్మాత బన్ని వాస్‌కు కూడా ఇదే ప్రశ్న ఎదురైంది. అందుకు ఆయన మాత్రం 'ఆ ఒక్కటీ అడక్కు' అంటున్నారు.

**అల్లు అర్జున్‌తో విజయ్ సేతుపతి?**

శ్రీచరణ్ రాచకొండ, గీత్ షైనిజంటగా నటించిన చిత్రం 'కన్యాకుమారి' చిత్రం ఆగస్టు 27 విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో బన్ని వాస్ పాల్గొని మాట్లాడారు. 'అల్లు అర్జున్ కొత్త మూవీ గురించి ఏమైనా చెబుతారా' అని అడగ్గా 'సన్ పిక్చర్స్ వాళ్లతో నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్ ఉంది. ప్రస్తుతం ఏమీ మాట్లాడలేను. ఏదైనా చెబితే వాళ్లే చెప్పాలి' అని తేల్చేశారు.

ఈ సమాధానం బన్ని అభిమానులకు ఒకింత నిరుత్సాహాన్ని కలిగించేదే. ఇక సినిమా షూటింగ్‌పై కార్మికుల సమ్మె ప్రభావం చూపించిందా? అని ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. 'తెలుగు సినిమా ఇండియాలో ఎక్కడ జరుగుతున్నా ఆపాల్సిందే. అందరి మధ్య సమన్వయం ఉంటుంది. సమ్మె కారణంగా కొన్ని సందర్భాల్లో ఇబ్బంది పడ్డాం. ఇంకొన్నిసార్లు అభ్యర్థన మేరకు కొంత షూట్ చేశాం. ఎందుకంటే కోట్ల రూపాయల ఖర్చుతో కూడుకొన్నది. పైగా విదేశీ నిపుణులు ఇండియాకు వచ్చి పనిచేస్తున్నారు. వాళ్లందరినీ ఖాళీగా కూర్చోబెట్టాలి. అనుకున్న ఒప్పందం ప్రకారం వాళ్లకు పనిలేకపోయినా, డబ్బులు చెల్లించాలి' అని బన్నీ వాస్ తెలిపారు. ఇక ఇందులో అల్లు అర్జున్ పాత్ర మూడు కోణాల్లో సాగుతుందని సమాచారం. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ వినియోగంతోపాటు... విజువల్ ఎఫెక్ట్స్ కి పెద్దపీట వేస్తూ ఈ సినిమాని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రూపొందుతున్న ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు సందడి చేయనున్నారు.

# ఇది కలా.. నిజమా?



దర్శకుడు సత్యన్ అంతికాడ్, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ లాంటి లెజెండ్స్‌తో కలిసి పనిచేసే అవకాశం వస్తుందని తాను ఊహించలేదని మాళవిక మోహనన్‌సంతోషం వ్యక్తం చేసింది. మోహన్‌లాల్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'హృదయపూర్వం'. సంగీత్ ప్రతాప్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 28న మలయాళంలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మాళవిక 'హృదయపూర్వం' మూవీకి పనిచేయడంపై సంతోషం వ్యక్తం చేసింది. అంతేకాదు, ఈ ఏడాది తనకెంతో ప్రత్యేకమని చెప్పింది.

"ఇద్దరు లెజెండ్స్‌తో కలిసి పనిచేశానా? అని ఇప్పటికీ నన్ను నేను గిల్లి చూసుకుంటున్నా. వారిద్దరూ ఊహాలకందని వ్యక్తులు. డెస్టినీ అంటే ఇదేనేమో. మిమ్మల్ని చిరునవ్వులతో ముంచెత్తడానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఇందులో నేను హరిత అనే మోడ్రన్ గర్ల్‌గా నటిస్తున్నా. ఈ పాత్రకు నేను చాలా కనెక్టయ్యా. జీవితంలో ఏం చేయాలనుకుంటే అది చేసే అమ్మాయిగా కనిపిస్తా. ఇప్పుడు నేను చెబుతున్నదాని కంటే డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ తెరపై చూస్తారు" అని మాళవిక చెప్పుకొచ్చింది.

ఇక ఈ ఏడాది తనకెంతో ప్రత్యేకమని చెబుతూ సంతోషం వ్యక్తం చేసింది. మూడు ఇండస్ట్రీల నుంచి మూడు అద్భుతమైన సినిమాలతో ప్రేక్షకులను పలకరించనున్నట్లు పేర్కొంది. "ఆగస్టు 28న 'హృదయపూర్వం' రానుంది. కార్తితో కలిసి నటించిన 'సర్దార్2' షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఇక తెలుగులో నా మొదటి చిత్రం 'ది రాజాసాబ్'. ప్రభాస్‌తో కలిసి చేస్తున్న ఈ మూవీ ఈ డిసెంబరులో విడుదల కానుంది. ఈ సినిమాల కోసం నేనెంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా" అంటూ చిరునవ్వులు చిందించింది. 'ది రాజాసాబ్' మూవీ మారుతీ దర్శకత్వంలో రూపొందుతోంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రభాస్ కూడా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఆయనపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

# 22 ఏళ్ల తర్వాత చిరంజీవి vs ప్రభాస్?

టాలీవుడ్‌కి సంక్రాంతి సీజన్ అంటేనే పెద్ద పండగ. ఏటా ఈ సీజన్‌కి మూడు లేదా నాలుగు క్రేజీ చిత్రాలు రిలీజ్ అయ్యినా, ప్రేక్షకుల అభిరుచి తగ్గదు. భారీ తారాగణంతో వస్తున్న సినిమాల మధ్య థియేటర్‌ల అడ్జస్ట్‌మెంట్ కూడా పెద్ద సవాలే. 2026 సంక్రాంతికి కూడా టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర పోటీ ఓ రేంజ్‌లో ఉంటుందనిపిస్తుంది. ముందుగా సంక్రాంతికి వచ్చే వారిలో చిరంజీవి ఉన్నారు. మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు' సంక్రాంతికి థియేటర్లలో సందడి చేయనుంది. సంక్రాంతికి పక్కా చిత్రాన్ని విడుదల చేయాలనే కసితో టీమ్ అంతా హార్డ్ వర్క్ చేస్తున్నారు.

ఈ సినిమాకి ట్యాగ్‌లైన్‌గా పండగకి వస్తున్నారు అని పెట్టడం విశేషం. చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటించగా, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ కాంబినేషన్‌కి భారీ క్రేజ్ ఉన్న నేపథ్యంలో ఈ సినిమా పట్ల ప్రేక్షకుల్లో ఇప్పటికే అంచనాలు పెరిగిపోతున్నాయి.ఇక సుదీర్ఘ కాలంగా వాయిదాలు పడుతూ వస్తున్న ప్రభాస్ సినిమా 'రాజాసాబ్' ఇప్పటికి కూడా డిసెంబర్ రిలీజ్ నుంచి సంక్రాంతికి వచ్చేందుకు రెడీ అవుతోందన్న టాక్ వినిపిస్తోంది. ఇదే జరిగితే 22 ఏళ్ల తర్వాత మరోసారి చిరంజీవి, ప్రభాస్ మధ్య సంక్రాంతి పోటీ అని చెప్పవచ్చు. 2004లో వర్షం (ప్రభాస్) vs అంజి (చిరంజీవి) సంక్రాంతికి పోటీ పడిన విషయం తెలిసిందే. అప్పుడు వర్షం బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది, కానీ అంజి పెద్దగా కలెక్షన్లు రాబట్టలేకపోయింది.

ఇక ఈ సంక్రాంతికి నవీన్ పోలిశెట్టి నటించిన 'అనగనగా ఒక రాజు' కూడా విడుదల కానుంది. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. తమిళ స్టార్ దళపతి విజయ్ హీరోగా తెరకెక్కిన 'జన నాయకుడు' చిత్రం కూడా అదే సమయానికి రిలీజ్ అవుతోంది.మరి కొన్ని చిత్రాలు కూడా సంక్రాంతికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. మొత్తానికి 2026 సంక్రాంతికి టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర నాలుగు పెద్ద చిత్రాలు పోటీలో పడనుండడంతో పోటీ రసవత్తరంగా ఉండనుంది. అయితే ఇందులో ఏ సినిమా హిట్ అవుతుంది? ఎవరిది సంక్రాంతి విజయం? అన్నదానికి సమాధానం మాత్రం ప్రేక్షకుల తీర్పుని బట్టి తెలుస్తుంది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999